బ్యాంకు ఎదుట రైతుల ధర్నా

జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ రైతులు వివిధ సమస్యలపై శుక్రవారం రోడ్డెక్కారు. తమ గ్రామంలో రుణమాఫీ పూర్తికాలేదని, రైతుభరోసా అందనేలేదని, వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని బ్యాంక్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. 24న అసెంబ్లీ ముట్టడికి రైతులంతా తరలివెళ్లాలని రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో తీర్మానించారు. రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పెర వెంకటరెడ్డి ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు.పార్టీలకతీతంగా అసెంబ్లీ ముట్టడిలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. –జగిత్యాల రురల్

చెరువులు నింపాలని రైతుల రాస్తారోకో

ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు ప్రభుత్వం వెంటనే గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. జనగామ– సిద్దిపేట ప్రధాన రహదారిపై బీఎస్సార్ నగర్ స్టేజీ వద్ద కట్కూర్, బీఎస్సార్నగర్ గ్రామాల రైతులు రాస్తారోకోకు దిగారు. వారికి బీఆర్ఎస్ నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల మాజీ సర్పంచులు ముశిని సునీతారాజుగౌడ్, కోనేటి స్వామి మాట్లాడుతూ సాగునీరు లేక చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో గోదావరి జలాలతో చెరువులు, కుంటలు కళకళలాడాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో సాగునీరందక అష్టకష్టాలు పడుతున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ముశిని శ్రీశైలం, ఓరుగంటి శ్రీనివాస్, మర్రికింది యాదయ్య, కెంగెర్ల రవి, పిడుగు మహేశ్, గుజ్జుల బాలనర్సయ్య, సాయిలు, రాజు, రజినీకాంత్, శ్రీనివాస్, ఐలయ్య పాల్గొన్నారు. – బచ్చన్నపేట

ఒకే ఊరిలో ఎండిన 150 ఎకరాల పంట

- అడుగంటిన భూగర్భ జలాలు
- సాగునీరు లేక అన్నదాత అరిగోస

ధర్మారం, మార్చి 21: ఒకే ఊరిలో సాగు చేసిన వరిపంట ఎండిపోయింది. ఆ ఊరిలో సుమారు 300 ఎకరాల్లో యాసంగి సీజన్‌లో రైతులు వరి పైరు సాగుచేశారు. దానిలో సుమారు 150 ఎకరాల్లో వరి పంట చేతికొచ్చే దశలో ఎండింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామ పరిధిలో అత్యధికంగా గిరిజన రైతులు సుమారు 300 ఎకరాల్లో వరి సాగు చేశారు. వరి నాట్లు వేసిన సమయంలో బావుల్లో భూగర్భజలాలు మెరుగ్గా ఉండగా, తీరా పంటలు చేతికొచ్చే దశలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో రైతులు వేల రూపాయలు పెట్టి క్రేన్ల ద్వారా పూడిక తీయించారు. అయినా ఊటలు రాలేదు. మరికొందరు రూ.లక్షలు వెచ్చించి పొక్లెయినర్లతో పూడిక తీస్తున్నారు. ఎంత లోతు తవ్వినా బావుల్లో చుక్కనీరు కనబడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో సగానికి సగం పంటలు ఎండుతున్నాయి. కండ్లముందే పంటలు ఎండిపోవడంతో వాటిలో గొర్రెలు, పశువులను మేపుతున్నారు. ప్రభుత్వం ఎండిన పంటలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. తమ గ్రామానికి సాగునీటిని అందించేందుకు నిర్మించతలపెట్టిన ఎస్సారెస్పీ ఉపకాల్వ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందని, దాని నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

కరీంనగర్ జిల్లా చొప్పదండి మార్కెట్‌యార్డులో వర్షానికి కొట్టుకుపోతున్న ధాన్యం

అకాల వర్షం.. అపార నష్టం

- రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వాన
- పలు పంటలకు తీవ్ర నష్టం.. మరో 3 రోజులు వడగండ్ల వర్షాలు
- అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : సీఎం రేవంత్‌రెడ్డి

సంగారెడ్డి జిల్లా నిజాంపేటలో గాలి వానకు నేలరాలిన చెట్లు

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పడ్డ రాళ్లు

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురిశాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కురిసిన వానకు వరి నేలవాలింది. వడగండ్లకు పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. మామిడి నేలరాలింది. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి రహదారులపై పడ్డాయి. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఈదురుగాలులతో వర్ష బీభత్సం సృష్టించింది. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో భారీ వర్షం పడింది. జగిత్యాల జిల్లా మేడిపల్లిలో, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట, దండేపల్లిలో వడగండ్ల వాన కురిసింది. కాగజ్‌నగర్‌లోని దుకాణాలపై కప్పులు ఎగిరిపడ్డాయి. పెద్దపల్లి జిల్లా మంథని, రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్ మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం వ్యాప్తంగా మోస్తరు వాన కురిసింది. మెదక్ పట్టణంతోపాటు, మెదక్ రూరల్, పాపన్నపేట కోల్చారం మండలాల్లో వర్షం పడింది. మెదక్– హైదరాబాద్ రోడ్డుపై చెట్టు పడడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. మెదక్ పట్టణం జంబికుంట వీధిలో ఓ ఇంటిపై పిడుగుపాటు పడటంతో సిద్ధయ్య అనే వ్యక్తి ఇంట్లోని సామగ్రి ధ్వంసమైంది. పోతంశెట్టిపల్లి వైన్స్ సమీపంలో కరెంటుపోలు విరిగిపడి ఓ వ్యక్తికి రెండు కాళ్లు విరిగాయి. 108లో మెదక్ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో వర్షం కురిసింది. ధర్పల్లి మండలం వాడి, లింగంపేట మండలం లింగంపల్లి, పోతయిపల్లిలో పిడుగులు పడి రెండు గేదేలు, మూడు గొర్రెలు మృతి చెందాయి. జగిత్యాల జిల్లాలో భారీ వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లాలో ఈదురుగాలుల వాన కురిసింది. చొప్పదండి వ్యవసాయ మార్కెట్లో నిల్వ చేసిన మొక్కజొన్న ధాన్యం కొట్టుకుపోయింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో మిరుదొడ్డి, దుబ్బాక, దౌల్తాబాద్, తొగుట మండలాల్లో వడగండ్లు పడ్డాయి. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. శనివారం ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో వడగండ్ల వానల పడనుండడంతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మూడ్రోజులు వడగండ్ల వానలు..

ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడ్రోజులపాటు పలుచోట్ల ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీచేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు అంచనా వేసింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది. మార్చి 24 నుంచి పొడి వాతావరణం ఉండే అవకాశం ఉందని వెల్లడించింది.

పంట దక్కాలని రైతన్న పాట్లు



నిర్మల్ జిల్లా మామడ మండలం తాండ్రకు చెందిన కస్తూరి భాస్కర్ ఏడెకరాల్లో వివిధ పంటలు సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయానికి వ్యవసాయ, బోరుబావిలో భూగర్భజలాలు అడుగంటగా ట్రాక్టర్ ట్యాంకర్‌లో ఇంటివద్ద బోరుబావి నీటిని వ్యవసాయ బావిలో నింపుతూ పంటలకు అందిస్తున్నాడు. –నిర్మల్ టైన్‌గేట్

పాటగూడలో కొలాం ఆదివాసీలకు నీటి గోస

ఆదిలాబాద్ ఇంద్రవెల్లి మండలం సమక గ్రామపంచాయతీ పరిధిలోని పాటగూడకు చెందిన కొలాం ఆదివాసీ గిరిజనులు బిందెడు నీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచి బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. – ఇంద్రవెల్లి



జనగామ జిల్లా తాటికొండలో ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

నేడు నీళ్లివ్వకుంటే 'దేవన్నపేట' ముట్టడి

- స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 21: దేవాదుల పంప్‌హౌస్ మోటర్లను శనివారంలోగా ఆన్ చేసి ధర్మసాగర్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్‌కు సాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే రాజయ్య డిమాండ్ చేశారు. లేకపోతే దేవన్నపేట పంప్‌హౌస్‌ను ముట్టడించి, రైతులతో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామంలోని మేకల వెంకటయ్య, గిద్దె బండ తండాలో బానోత్ రాముకు చెందిన ఎండిన పంటపొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. బాధిత రైతుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ సాగునీరు అందక మేకల వెంకటయ్యకు చెందిన 4 ఎకరాలు, గిద్దె బండ తండాలో బానోత్ రాముకు చెందిన 8 ఎకరాల పంట పొలం ఎండిపోయిందని ఆవేదన్య వ్యక్తంచేశారు.

అదే టైటిల్ ఖరారు?

రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఓ విలేజ్ స్పోర్ట్స్ డ్రామా చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. జాన్వీ కపూర్ కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాకు 'పెద్ది' అనే టైటిల్ గత కొంతకాలంగా ప్రచారంలో ఉంది. తాజా సమాచారం ప్రకారం మేకర్స్ ఇదే టైటిల్‌ను ఖరారు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ నెల 27న రామ్‌చరణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సినిమా టైటిల్ ప్రకటన, టీజర్ రిలీజ్ ఉంటాయని సమాచారం. అయితే ఈ విషయంపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాకు ఏ.ఆర్.రెహమాన్ సంగీతాన్నందిస్తున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నాయి. 'గేమ్ ఛేంజర్'కు ఆశించిన స్థాయిలో ఆదరణ దక్కకపోవడంతో రామ్‌చరణ్ అభిమానులు ఈ స్పోర్ట్స్ డ్రామాపై భారీ అంచనాల్ని పెట్టుకున్నారు.

ఆమే నా మొదటి భార్య

శృతి మించిన అభిమానం వల్ల చాలామంది స్టార్లు ఇబ్బందులు పడ్డ సందర్భాలు దేశంలో కోకొల్లలు. ఒకప్పుటి బాలీవుడ్ సూపర్‌స్టార్ రాజేష్‌ఖన్నా కారును లేడీ ఫ్యాన్స్ ముద్దులతో ముంచెత్తేవారట. ఆ కారు టైర్ గుర్తులున్న మట్టిని తీసి బొట్టు పెట్టుకునేవారట. కెరీర్ తొలినాళ్లలో బాలీవుడ్ అగ్రహీరో రణ్‌బీర్ కపూర్‌కి కూడా ఇలాంటి అనుభవమే ఎదురైందట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలియజేశారు. 'నాకు ఫస్ట్‌నుంచీ లేడీ ఫ్యాన్స్ కాస్త ఎక్కువే. కెరీర్ తొలినాళ్లలో ఓ మహిళా అభిమాని.. రోజూ మా ఇంటి ముందుకొచ్చి నిలబడేదట. ఓ రోజు నేను ఇంట్లో లేని సమయం చూసి, ఓ పురోహితుడ్ని తీసుకొచ్చి మా ఇంటి గేట్‌ని పెళ్లి చేసేసుకుందట. గేట్‌కు పువ్వులు, బొట్టు పెట్టింది. నేను ఊరు నుంచి రాగానే ఈ విషయాన్ని మా వాచ్‌మ్యాన్ నాకు చెప్పాడు. దాంతో ఆశ్చర్యపోయాను. ఓ విధంగా చూసుకుంటే ఆమె నా మొదటిభార్య. అయితే నేను ఇప్పటివరకూ ఆమెను చూడలేదు. తనను కలిసే రోజు కోసం ఎదురుచూస్తున్న' అని సరదాగా చెప్పుకొచ్చారు రణ్‌బీర్.

మైథాలజీ అంశంతో 'దీక్ష'

ప్రతాని రామకృష్ణగౌడ్ స్వీయ దర్శకనిర్మాణంలో తెరకెక్కించిన చిత్రం 'దీక్ష'. లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. కిరణ్, అలేఖ్య రెడ్డి జంటగా నటించారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దర్శకనిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చనే పాయింట్ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. కథలోని మైథలాజికల్ అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి. కథానుగుణంగా అద్భుతమైన సంగీతం కుదిరింది. ఐదు పాటలు ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఆక్సఖాన్, తులసి, అనూష తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు.

చిత్రం

ఏమిచ్చి మీ రుణం తీర్చుకోగలను!

'రెండేళ్లుగా ఒక్క సినిమా చేయలేదు. ఈ మధ్యకాలంలో ఒక్క హిట్ లేదు. అయినా నాపై మీ ప్రేమ ఏ మాత్రం తగ్గలేదు. ఏమిచ్చి మీ రుణం తీర్చుకోగలను. మీరు లేకుండా నేను లేను' అంటూ బిహైండ్‌వుడ్స్ అవార్డుల వేడుకలో సమంత భావోద్వేగానికి గురయ్యారు. చెన్నైలో జరిగిన ఈ అవార్డుల వేడుకలో.. ప్రతిష్టాత్మకమైన కె.బాలచందర్ హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డుతో సమంతను సత్కరించారు. దశాబ్దంన్నర నుంచి స్ఫూర్తిదాయకమైన పాత్రలలో ప్రేక్షకులను అలరిస్తున్నందుకుగాను సమంతకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా ఆమె ఇంకా మాట్లాడుతూ 'ఈ అవార్డు నాకెంతో ప్రత్యేకం. ఎన్నో అద్భుతమైన పాత్రలను మనకు పరిచయం చేశారు కె.బాలచందర్ గారు. ముఖ్యంగా ఆయన సినిమాల్లో స్త్రీ పాత్రలు సహజంగా, బలమైన వ్యక్తిత్వంతో ఉంటాయి. నాకెంతో స్ఫూర్తినిచ్చిన పాత్రలు అవన్నీ. ఈ అవార్డు అందుకోవడంతో నా జీవితం పరిపూర్ణమైనట్టు భావిస్తున్నా.' అంటూ ఆనందం వెలిబుచ్చారు సమంత.

నంది అవార్డ్స్‌ను పునరుద్ధరించాలి

ఆంధ్రప్రదేశ్‌లో సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం కొత్త విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించిన అక్కడి ప్రభుత్వానికి తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు ప్రొడ్యూసర్ కౌన్సిల్ గౌరవ కార్యదర్శి టి.ప్రసన్నకుమార్. ఏపీలో తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధిని కాంక్షిస్తూ వైజాగ్, తిరుపతి, రాజమండ్రిలో స్టూడియోల నిర్మాణం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని ఆయన పేర్కొన్నారు. ఏపీలో ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కోసం పూర్తి సహాయసహకారాలు అందిస్తామని, అలాగే నంది అవార్డులను పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న ఇతర అవార్డులను కూడా అందించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించినట్లు ప్రసన్నకుమార్ తెలిపారు.

నిన్ను చూడంగ.. కనులు చాలవుగా..

నవీన్‌చంద్ర, షాలినీ వడ్ని కట్టి జంటగా నటిస్తున్న చిత్రం '28 డిగ్రీ సెల్సియస్'. డా॥ అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అభిషేక్ నిర్మించారు. ఈ నెల 28న విడుదలకానుంది. ఈ సినిమా నుంచి 'చెలియా చెలియా..' అనే పాటను శుక్రవారం విడుదల చేశారు. శ్రావణ్ భరద్వాజ్ కంపోజ్ చేసిన ఈ పాటకు కిట్టు విస్సాప్రగడ సాహిత్యాన్నందించారు. 'నీ నగుమోము కనులారా చూస్తుంటే క్షణమైనా కనురెప్ప వాలేనా, నా కనుసైగ నీ వెనకా వెంటాడే మౌనంగా, నిన్ను చూడంగ..కనులు చాలవుగా..నా జతగా రా, చెలియా చెలియా' అంటూ చక్కటి లవ్‌ఫీల్‌తో ఈ పాట సాగింది. హృదయాన్ని స్పృశించే ప్రేమకథా చిత్రమిదని, ఇందులో టెంపరేచర్ అనే కాన్సెప్ట్ ఆసక్తికరంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. జయప్రకాష్, ప్రియదర్శి, హర్ష చెముడు తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: శ్రావణ్ భరద్వాజ్, దర్శకత్వం: డా॥ అనిల్ విశ్వనాథ్.

'స్పిరిట్' కథ ఇదేనా?



ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందనున్న 'స్పిరిట్' చిత్రం మే నెలలో పట్టాలెక్కనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇంకా సెట్స్ మీదకు వెళ్లకముందే ఈ సినిమా అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఇందులో ప్రభాస్ వృత్తి పట్ల నిబద్ధత, నిజాయితీ కలిగిన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. తెలుగు తెరపై ఇప్పటివరకు రానటువంటి పవర్‌ఫుల్ న్యూఏజ్ కాప్ స్టోరీ ఇదని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పలు ఇంటర్వ్యూలో చెప్పారు. తాజాగా ఈ సినిమా కథాంశం గురించి సోషల్‌మీడియాలో విస్తృతంగా వార్తలొస్తున్నాయి. మధ్యతరగతి నుంచి స్వశక్తితో ఎదిగిన పోలీస్ పాత్రలో ప్రభాస్ కనిపిస్తారని, ఆయనకు భార్య, నాలుగేళ్ల కూతురు కూడా ఉంటుందని, కుటుంబాన్ని ప్రాణప్రదంగా భావించే పోలీస్ ఆఫీసర్ జీవితంలో చోటుచేసుకునే అనుకోని సంఘటనలు, అతన్ని ఓ బలమైన శత్రువును ఢీకొట్టే లక్ష్యం వైపు ఎలా నడిపించాయన్నదే కథాంశమని ఆ వార్తల సారాంశం. అయితే వీటిని సందీప్ రెడ్డి అభిమానులు కొట్టిపారేస్తున్నారు. ఈ తరహా సాధారణ రివేంజ్ స్టోరీని ఆయన ఎంచుకోడని, 'స్పిరిట్' కథలో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్ చాలా ఉంటాయని అంటున్నారు. మరి నిజానిజాలేమిటో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం ప్రభాస్ 'ది రాజా సాబ్' 'ఫౌజీ' చిత్రాల్లో నటిస్తున్నారు.

తొలిప్రేమ జ్ఞాపకాల్లో..

ప్రదీప్ మాచిరాజు హీరోగా నటిస్తున్న చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. నితిన్–భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీపికా పిల్లి కథానాయిక. ఏప్రిల్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది. మాంక్స్ అండ్ మంకీస్ సంస్థ నిర్మిస్తున్నది. గురువారం ఈ సినిమాలోని 'మొదటి చినుకు..' అనే మూడో పాటను విడుదల చేశారు. రథన్ స్వరపరచిన ఈ పాటను చంద్రబోస్ రచించారు. గ్రామీణ నేపథ్యంలో చిత్రీకరించిన ఈ పాట తొలి ప్రేమలోని జ్ఞాపకాలను ఆవిష్కరిస్తూ సాగింది. సిధ్‌శ్రీరామ్ గాత్రం హైలైట్‌గా నిలిచింది. మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని చిత్ర బృందం పేర్కొంది. వెన్నెల కిషోర్, సత్య, గెటప్ శ్రీను, మురళీధర్ గౌడ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రథన్, కథ, మాటలు: సందీప్ బొల్లా, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: నితిన్–భరత్.

'ఎల్లమ్మ' నుంచి తప్పుకున్నదా?

'బలగం' చిత్రంతో విమర్శకుల ప్రశంసలందుకున్నారు దర్శకుడు వేణు యెల్దండి. ఆయన తదుపరి చిత్రంగా 'ఎల్లమ్మ'ను తెరకెక్కించబోతున్నారు. నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి దిల్ రాజు నిర్మాత. తెలంగాణ నేపథ్యంలో గ్రామదేవతల చుట్టూ తిరిగే సోషల్‌డ్రామా ఇదని సమాచారం. ఈ సినిమాలో కథానాయికగా సాయిపల్లవి నటించనున్నట్లు వార్తలొచ్చాయి. కథలోని కొత్తదనం, భావోద్వేగాలు నచ్చడంతో ఆమె ఈ సినిమాకు వెంటనే అంగీకరించిందని కథనాలొచ్చాయి. తాజా సమాచారం ప్రకారం సాయిపల్లవి ఈ సినిమా నుంచి తప్పుకున్నట్లు తెలిసింది. ఈ చిత్రం మే లేదా జూన్ నెలలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. అయితే ఆ సమయంలో సాయిపల్లవి డేట్స్ ఖాళీగా లేవని, ఇతర సినిమాలతో ఉన్న ముందస్తు కమిట్‌మెంట్ కారణంగా ఆమె 'ఎల్లమ్మ' నుంచి అయిష్టంగానే తప్పుకుందని వార్తలు వినిపిస్తున్నాయి. 'ఎల్లమ్మ'లో సాయిపల్లవి కథానాయికగా నటించడం లేదని ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో హీరో నితిన్ వెల్లడించడం కూడా ఈ వార్తలకు బలం చేకూరుస్తున్నది. కథానుగుణంగా స్టార్ హీరోయిన్ అవసరం కావడంతో కీర్తి సురేష్, రష్మిక మందన్న వంటి అగ్ర తారలను ఈ సినిమా కోసం సంప్రదించే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు తెలిసింది. ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే అంటున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.